
# మనిషి బుద్ధి

- ముక్కారెడ్డి -



సామ్రాజ్యమ్మగారికి చూపు సరిగా ఆనదు. కాని అతన్ని గుర్తుపట్టలేకపోవటానికి కారణం అదిమాత్రం కాదు.

ఆమె గుమ్మంలో నిలబడి మెట్లమీద ఠీవిగా నుంచున్న అతన్ని మరోసారి పరకాయించి చూసింది. ఆమె భుజాలమీదుగా బాలాత్రిపురసుందరి తొంగి చూస్తోంది. అతనేమో వీళ్ళిద్దరినంకా చిరునవ్వుతో చూస్తున్నాడు. ఇరవై, ఇరవైరెండేళ్ళుంటాయతనికి. చామనఛాయ. సన్నగా పొడుగ్గా వున్నాడు. తెల్లని పాంటూ బుష్షర్టూ వేశాడు. కళ్ళకు నల్లటి అద్దాలతో హుందాగా కనిపిస్తున్నాడు. భుజానికో ఎయిర్‌బాగ్ వేలాడుతోంది. అతన్నిచూశాక సామ్రాజ్యమ్మగారికి కలిగిన మొదటి అభిప్రాయం 'అమ్మడికి సరైనజోడు సుమా!' అని. అమ్మడు కూడా అలానే అనుకుంది.

రెండు నిమిషాలు వాళ్ళ చూపులను తట్టుకొన్నమీదట 'లోపలికి రానియ్యవా ఏమిటి?' చిరునవ్వుతో చొరవగా అడిగాడతను.

అతనిమాటలు సామ్రాజ్యమ్మగారికి కొంచెం కోపం తెప్పించాయి. ఎవరో వూరూ, పేరూలేని (తెలీని) వ్యక్తి తనని, వూరంతా పేరువింటేనే హడలిపొయ్యేతనని, ఏకవచనంలో సంబోధించినందుకు. 'అమ్మడికి సరైన జోడు' అనే ఆమె ఆలోచన మాత్రమే అతన్ని కాపాడింది.

'ఎవర్నాయనా నువ్వూ?' తన మహాకాయాన్ని అతి ప్రయాసమీద పక్కకి తొలగిస్తూ అడిగిందామె. బాలాత్రిపురసుందరి లోపలికి వెళ్ళిపోయి తలుపుసందులోంచి తొంగి తొంగి చూస్తోంది. అతను సామ్రాజ్యమ్మగారి ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. ఆపిల్ల వెళ్ళినవేపే చూస్తూ లోపలికి వచ్చేడు. ఎయిర్‌బాగ్‌ని ఓ కుర్చీలో పడవేసి, తనూ ఓ కుర్చీలో విశ్రాంతిగా కూచుని 'అమ్మయ్య!' అని నిట్టూర్చేడు.

అతని చూపులనే కనిపెడుతున్న సామ్రాజ్యమ్మగారి కితని వరసేం నచ్చలేదు. 'ఎవరంటే చెప్పవేమయ్యా?' రెట్టించిందావిడ 'ఎవరు కావాలి నీకు!'

'సుందరి!' అతను ఠక్కున చెప్పేశాడు. లోపల్నించి అతన్నే దీక్షగా చూస్తున్న అమ్మడులిక్కిపడింది. సామ్రాజ్యమ్మగారికి అతనేమన్నాడో ఓపట్టాన అర్థంకాలేదు. అంత ధైర్యంగా ఆమాట అనగలిగేవాళ్ళుంటారని ఆవిడ బహుశః ఊహించి ఉండదు. ఆమె అర్థం చేసుకుని కోపంగా ఏదో అనబొయ్యేలోపలే, అతను కళ్ళజోడు తీసి ఎదట ఉన్న టేబిల్‌మీద పెడుతూ 'ఇంకా పోల్చుకోలేదా?' అన్నాడు.

తనేమనాలనుకున్నదో మర్చిపోయి అతనివంకే పరీక్షగా చూసిందావిడ. 'ఎక్కడో చూసినట్టే వుంది మొహం!' అనుకున్నది. కాని ఎక్కడ ఏ సందర్భంలో చూసిందో జ్ఞాపకం లేదు.

ఆమెనిక ఇబ్బంది పెట్టడంలో ఉన్న ప్రమాదాన్ని గ్రహించి అతను పెద్దగా నవ్వుతూ 'నేనత్తయ్యా! శంకరాన్ని!' అన్నాడు.

ఆమె నోరు తెరిచింది.

'ఏమిటీ! శంకరానివా! హారిని! ఎంత వాడివయ్యా వెంత వాడివయ్యావు! ఇంకా పోల్చుకోలేదా అంటావేమిటయ్యా!' అన్నదామె ఆశ్చర్యంగా.

తలుపుచాటున నుంచున్న అమ్మడి హృదయం ఆనందంతో గెంతులేసింది. ఆపిల్ల చిన్నతనంనుంచి శంకరం గురించి తల్లిదండ్రులిద్దరూ మాట్లాడుకోటం విన్నది. అతడు తనే బావయినందుకు కాదు

సంతోషం. ధైర్యంగా 'సుందరి కావాలి' అన్న వ్యక్తే తన బావయిపోవటం.

సామ్రాజ్యమ్మగారు తన ఆశ్చర్యంతో పాలు పంచుకోటానికి కూతుర్ని పిలిచింది. 'అమ్మడూ ఇటురావే! పరాయివాడేం కాదులే! ఏడేళ్ళనాడు అలిగి పారిపోయిన మీ బావే నమ్మా!' అంటూ. కాని సుందరి సిగ్గుతో బయటికిరాలేదు. అక్కడినుంచి వాళ్ళిద్దరూ స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నారాయె. వాళ్ళ మాటలుకూడా అంతకంటే స్పష్టంగా విని పిస్తూనేవున్నాయె. ఇంకెందుకూ బయటికి రావటం?

అతనోసారి తలుపువేపు నిరాశగా చూసి, వంగి బూటులేసులు విప్పుకోసాగేడు. ఓవేపు సామ్రాజ్యమ్మ ప్రశ్నలవర్షం కురిపిస్తోంది.

'ఎక్కణ్ణుంచీ రావటం? ఏం చేశా విన్నాళ్ళూ? డబ్బు బాగానే సంపాదించి నట్టున్నావ్? అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపొయ్యావు!' అని.

'నువ్వుమాత్రం మారిపోలేదా అత్తయ్యా! చాలా లావయి పొయ్యావు!' అంటూ నవ్వాడతను.

'నామాటకేంలే! వయసొచ్చేసింది!' అందావిడ నిరాశగా.

'సరేగానత్తయ్యా! మామయ్యేడీ?' అడిగాడు శంకరం.

'పొలంవేపు వెళ్ళారు. ఈపాటికి వచ్చేస్తుండాలే. నేనడిగిందానికి జవాబివ్వ వేమయ్యా!' జ్ఞాపకం చేసిందావిడ మళ్ళీ.

బూట్లు విప్పేసి కుర్చీ పక్కనపెడుతూ 'అదంతా ఓ పెద్ద కథలే అత్తయ్యా! తరవాత తీరిగ్గా చెప్తాగాని, ఇంటికొచ్చినవాడికి ఇట్లాగేనా మర్యాదచెయ్యడం! కాఫీ ఇద్దూ కొంచెం. అలసటగావుంది!' అన్నాడు అతను.

ఆమె చిన్నబుచ్చుకుంది. సర్దుకుని 'ఏకంగా స్నానమేచెయ్యరాదుటయ్యా! భోజనాల వేళయింది!' అన్నది.

'ప్రొద్దున స్నానం వగయిరాలు కానిచ్చే బయల్దేరాను. మామయ్యొచ్చాక ఇద్దరం కలిసి కూర్చుంటాం భోజనానికి. ప్రస్తుతానికి కాఫీ ఇద్దూ!' అన్నాడతను.

'సరే! నువ్వు కాళ్ళూచేతులూ కడుక్కో. ఇప్పుడే చేసి తీసుకొస్తాను.' అని 'అమ్మడూ! పెద్దచెంబులో నీళ్ళు పట్రా! బావ కాళ్ళు కడుక్కుంటాడు!' అంటూ లోపలికెళ్ళింది.

కాసేపట్లో బాలా త్రిపురసుందరి సిగ్గుతో అష్టవంకర్లుపోతూ, నీళ్ళు పట్టుకుని మెల్లిగా నడుస్తూ బయటికొచ్చింది.

శంకరం ఆమె వేపోసారి పరీక్షగా చూశాడు.

పదహారేళ్ళ పడుచుదనంలో వుందా అమ్మాయి. కొంచెం లావు. అయినా అందంగానేవుంది. తన భుజాలదాకా వొచ్చే ఎత్తు. పెద్ద పెద్ద కళ్ళు, కోలమొహం.

ఆమె చేతిలోంచి చెంబునందుకుంటూ 'బాగా పెరిగిపొయ్యావ్ సుందూ!' అన్నాడతను.

ఆమె ఓక్షణం తలెత్తి అతన్ని కళ్ళల్లోకి చూసి సిగ్గుతో తలదించుకుంది.

'నాదగ్గర సిగ్గేమిటే నీకూ! చిన్నతనంలో నిన్నెత్తుకుని ఆడించాను తెలుసా!' అన్నాడు శంకరం వాకిట్లోకి నడుస్తూ.

ఆమె మరింత సిగ్గుపడిపోయి లోపలికి తుర్రుమంది.

అతను ముఖమూ కాళ్ళూ కడుక్కుని వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. బాగ్‌లోంచి టవల్ తీసి మొహం తుడుచుకొన్నాడు. ఇంతలో సామ్రాజ్యమ్మ కాఫీ తెచ్చింది. అది త్రాగేసి సిగరెట్ వెలిగించాడు. ఏదేదో అడుగుదామని వచ్చిన ఆమెకి అతను బాగ్‌లోంచేదో పత్రికతీసి చదువు మొదలెట్టటంతో నిరాశగా లోపలికి వెళ్ళక తప్పలేదు.

అరగంట తరువాత పరంధామయ్యగారు వొచ్చేరు. సామ్రాజ్యమ్మ చెప్పిందాకా ఆయనా అతన్ని గుర్తుపట్టలేకపోయేరు.

ఆయన స్నానంచేశాక మామా అల్లుళ్ళిదరు భోజనానికి కూర్చున్నారు. సామ్రాజ్యమ్మ వడ్డనచేస్తోంది తన భారీ శరీరాన్ని అయాసంగా కదిలిస్తూ. బాలా త్రిపురసుందరి వెనకగదిలో తచ్చాడుతోంది.

'ఎక్కడున్నావురా ఇన్నాళ్ళూ?' పరంధామయ్యగారు అడిగారు. మేనమామ కనక ఆయన అలాగే పిలుస్తారు అతన్ని. శంకరం ఈ ప్రశ్న వస్తుందనే ఎదురు చూస్తున్నాడు.

'హైదరాబాదులో మామయ్యా!' అన్నాడతను.

'ఏంచేశావక్కడ?'

'చదువుకున్నాను ప్రస్తుతం వ్యాపారంలో దిగేను!' చెప్పేడు శంకరం.

'అంత డబ్బెక్కడిదీ!' ఆయన ఆశ్చర్యంగా ప్రశ్నించారు.

శంకరానికి ఎట్లా మొదలెట్టాలో తెలియలేదు. వెనకగదిలో అమ్మడూ, ఎదట సామ్రాజ్యమ్మగారు ఆసక్తిగా చెవులు రిక్కించారు.

'ఆరోజు అత్తయ్య కొట్టి బయటకు వెళ్ళమనగానే ఎక్కడలేని కోపం వచ్చింది నాకు. ఈ దెబ్బలూ, చీవాట్లూ తింటూ ఎక్కువరోజులు ఇక్కడుండలేననిపించింది...'

సామ్రాజ్యమ్మగారు ముఖం మాడ్చుకుంది, 'అదేమిటి నాయనా! అలా అంటావు. నువ్వేం పరాయివాడివా నాకు! అమ్మడితో సమానం కాదూ! అదిమాత్రం తప్పుచేస్తే కొట్టలే. నువ్వంత మనసు విరుచుకుంటావనుకుంటే ఏమీ అనకపోదును. నువ్వెళ్ళిపోయాక, ఎంత ఏడిచానో, నిన్ను వెదకటానికి ఎంతమందిని పంపించానో, వీరా మామయ్యనే అడగరాదూ!' అంది.

శంకరం నవ్వాడు. 'దానికి నేనేమీ అవటంలేదత్తయ్యా! చిన్నతనం కాదూ. ఆ వయసులో అలానే అనిపిస్తుంది. ఇంతకీ నువ్వలా చెయ్యటం నా మంచికే అయింది!' చెయ్యి కడుక్కుంటూ అన్నాడతను. ఇద్దరూ బయటిగదిలోకి వచ్చేరు. అమ్మడు పక్కకి తప్పుకుంది. సామ్రాజ్యమ్మ వంటిల్లు చక్కబెట్టి వాళ్ళవెనకవే బయటికి వచ్చింది.

వక్కపొడి నములుతూ చెప్పటం ప్రారంభించాడు శంకరం.

'వెళ్ళటం వెళ్ళటం రైలుస్టేషన్‌కి వెళ్ళాను. కనిపించిన రైల్లో ఎక్కేసేను. ఎక్కడికిపోతున్నానో నాకేమీ తెలీలేదు. ఇక్కడినుండి తప్పించుకువెళ్ళాలనే ఆత్రుత. ఓ స్టేషన్‌లో టి. సి. పట్టుకున్నాడు. రైలునుంచి దింపేసే సమయానికి నా పరిస్థితిచూసి జాలిపడి ఒకాయన డబ్బిచ్చి టిక్కెట్టుకొన్నాడు. తన ప్రక్కనే కూర్చోబెట్టుకుని అన్ని వివరాలు అడిగాడు. హైదరాబాద్‌లో దిగేక నన్ను వెంటనే తీసుకువెళ్ళారు.

ఆయన ఉండే లంకంత ఇంట్లో ఆయనా ఆయన భార్యా ఇద్దరు నౌకర్లు మాత్రమే ఉంటున్నారు. పిల్లల్లేరు ఆయనకి...'

'ఆయన పేరేమిటి?' పరంధామయ్యగారు జిజ్ఞాసగా అడిగారు.

శంకరం తడబడ్డాడు. ఓ నిమిషం ఆగి 'వెంకటరత్నంగారు ఆయనపేరు. పెద్ద వ్యాపారస్థుడు. వాళ్ళు నన్ను తమ సొంత

కొడుకు మాదిరిగా చూసుకున్నారు. అమ్మా, నాన్నా అని పిలవమన్నారు తమని. నన్ను స్కూల్లో చేర్పించేరు. మూడేళ్ళక్రిందట ఆమెపోయింది. ఆ పైన ఆయన నామీదనే ఆశలన్నీ పెట్టుకుని జీవించేడు. కాని లాభం లేకపోయింది. మూడునెల్లక్రిందట నేను బి. ఎస్‌సి. పాసవటమూ, ఆయన కాన్సర్‌తో చనిపోవటమూ ఒక్కసారే జరిగింది....'

'పాపం!' అన్నారు శ్రోతలిద్దరూ. మూడవశ్రోత ఏమీ అనటానికి వీల్లేక పూరుకుంది.

శంకరంలో విచారమేమీ కనిపించలేదు.

'మళ్లీ ఒంటరిగాణ్ణయ్యాను. లంకంత ఇల్లు, అందులో ఒక్కణ్ని. ఇక ముందు ఏం చెయ్యాలో అర్థంకాలేదు. చివరికి విదేశాలకువెళ్ళి చదువుకుందామని నిశ్చయించుకున్నాను. ఆయనుండగానే పెళ్లిచేసుకో మన్నారు నన్ను. కాని నేనే ఒప్పుకోలేదు. మీరూ నేను దూరమయినా, మీకు తెలియపరచకుండా ఎట్లా చేసుకునేది! అప్పట్లో రావటానికి వీల్లేకపోయింది ఆయన జబ్బుతో హాస్పిటల్‌లో ఉండటంతో. ఇక వారం రోజుల్లో ఈ దేశం విడిచిపెట్టబోతున్నాను. వెళ్ళేప్పుడయినా మిమ్మల్నందరినీ ఓసారి చూసిపోదామనిపించి ఇక్కడికి వచ్చేను. మళ్ళీ ఏడాది దాకా తిరిగిరాను' ముగించాడు శంకరం.

పరంధామయ్యగారు అల్లుడు ప్రయోజకుడయినందుకు సంతోషించారు. ఇన్నాళ్ళూ ఆయనకిదో మనోవేదనక్రింద ఉండేది. శంకరం ఇంట్లోంచి వెళ్ళిపోవటానికి తను కారణం కాకపోయినా నలుగురు తననే వేలెత్తి చూపిస్తున్నట్టనిపించేది. అతను బ్రతికి ఉన్నాడో లేదో కూడా తెలీదిన్నాళ్ళూ. అకస్మాత్తుగా తిరిగిరావటం, అదీ అదృష్టం వెంటబెట్టుకుని, ఆయనకానందం కలిగించింది.

సామ్రాజ్యమ్మ అల్లుడు వారంరోజుల్లోనే దేశం విడిచిపెట్టి వెళ్ళిపోయేవాడనీ, ఏడాదిదాకా తిరిగిరాడని విని ఆలోచనలో పడింది.

బాలా త్రిపురసుందరి నిలబడే కలలు కంటోంది. అంత గొప్పవాడయిన బావ వస్తూ వస్తూనే 'సుందరికావాలి' అనటమే ఆ పిల్లకి ఏదో పెద్దరికం వచ్చినట్లనిపిస్తున్నది.

# మనిషి బుద్ధి

మర్నాడుదయం శంకరం నిద్రలేచేసరికి ఎనిమిదయింది. అప్పుడైనా అతను లేవకపోను. సామ్రాజ్యమ్మగారు బావని లేపమని కూతురికి పురమాయించింది. ఆ పిల్లవచ్చి ఏమని లేపాలో తోచక ప్రక్కనే అలమారులో ఉన్న రేడియో ఫుల్ వాల్యూంలో పెట్టేసింది. కళ్ళువిప్పి ఆమె చేసినపని గమనించి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు శంకరం.

ఆ అమ్మాయికి పిలవక తప్పలేదు.

'బావా! ప్రొద్దెక్కింది. లేచి మొహం కడుక్కోండి.' అన్నది సన్నగా.

'ఇప్పుడప్పుడే లేవను.' అన్నాడు శంకరం కళ్ళు మూసుకునే.

'నేన్లేపి కూర్చోబెట్టేదా!' అని నాలిక్కరుచుకుంది సుందరి. శంకరం ఆశ్చర్యంతో కళ్ళు తెరిచాడు. నిన్నంతా తప్పించుకుని తిరిగిన ఆపిల్ల అంత చొరవ చెయ్యటంతో.

'సరే నీ ఇష్టం!' అన్నాడు నవ్వుతూ.

ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది. బయటికి వెళ్ళటానికి వెనక్కి తిరిగింది. ఓరకంట ఆమెనే గమనిస్తున్న శంకరం చటుక్కున లేచికూర్చుని ఆమె చెయ్యి అందుకున్నాడు.

'ష్ వొదలండి బావా! ఏమిటిది? అమ్మ వొస్తుంది!' అన్నది విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

'వస్తే ఏం!' అంటూ అరచెయ్యిని ముద్దు పెట్టుకుని వొదిలేశాడు శంకరం. ఆపిల్ల వొళ్ళు జిల్లుమంది.

అతను వొదిలేసిన వెంటనే దూరంగా వెళ్ళి 'మొహం కడుక్కోండి. కాఫీ తెస్తాను.' అంటూ వెళ్ళిపోయింది సుందరి.

భోజనం చేశాక పరంధామయ్యగారు పొలం వెళ్ళిపోయారు. శంకరం వచ్చాడని తెలిసి వూళ్ళోవాళ్లొక్కొక్కరే వచ్చి పోసాగేరు. అందరితో మాట్లాడి, అంతా వెళ్ళిపోయేక పత్రిక చేతిలోకి తీసుకుని కూర్చున్నాడు శంకరం. అప్పటిదాక వెనక గదిలోవున్న సుందరి అంతా వెళ్ళిపోవటంతో అతనున్న గదిలోకి వచ్చింది. అతనున్నది గమనించనట్టే రేడియోదగ్గరికి వెళ్ళి ట్యూన్ చేసింది. ఏదో తెలుగు కార్యక్రమం వస్తున్నది.

'రోజూ రేడియో వింటావా సుందరూ!' పలకరించాడతను.

'నాకోసమే తెచ్చాడాయె నాన్న. వినకపోతే ఎట్టా!' ఇటు తిరిగి నవ్విందాపిల్ల.

'ఎంతదాకా చదివావు?' అడిగాడు.

'అయిదు...'

'ఓస్ అంతేనా! ఫరవాలేదులే. నేన్నేర్పుతాగా!' అన్నాడు శంకరం.

'మరి నువ్వెళ్ళిపోతానంటున్నావుగా!' అమాయకంగా అడిగింది సుందరి.

'నువ్వు పెళ్ళాడతానంటే ఉంటాను మరి!' అన్నాడు శంకరం చిలిపిగా.

సుందరి సిగ్గుతో తలవంచుకున్నది.

'అమ్మేం చేస్తున్నది లోపల!' మాట తప్పిస్తూ అడిగాడు శంకరం.

'ఏదో పనిచేస్తున్నది. నన్ను నీతో మాట్లాడుతూవుండమన్నది!' అన్నది సుందరి తలవంచుకునే.

శంకరం నవ్వుకున్నాడు. నిన్నటినుంచి సామ్రాజ్యమ్మ చూపుతున్న ఆప్యాయతలోని అంతరార్థం గ్రహించాడతను. తల్లీ తండ్రీపోయి దిక్కులేక మేనమామ పంచన చేరినప్పుడు, అతనికి నరకం అంటే ఏమిటో తెలిసేట్టుచేసింది సామ్రాజ్యమ్మ. ఇప్పుడు అల్లుడు సామాన్యుడుకాడని పెద్ద చదువులు చదివాడని, డబ్బుగలవాడయ్యాడని మర్యాదలు చేస్తోంది. ఒకవేళ తను బీదవానిగానే ఈ ఇంటికివస్తే...? ఈ మర్యాదలేవీ జరిగేవికావు. సుందరిని తనదగ్గరిదాకా రానిచ్చేదికాదు. ఉన్నదంతా వేషభాషల్లో.

అతనాలోచిస్తుండగానే సామ్రాజ్యమ్మ చేతులు తుడుచుకుంటూ బయటికివచ్చింది.

వస్తూనే, 'రేపే వెళతానన్నావుటగా మామయ్యతో' న్నాళ్లోజులుంటే అరిగిపోతావా?' నిష్ఠూరంగా అన్నదావిడ.

'లేదత్తయ్యా! వెళ్ళాలి! అక్కడ వ్యాపారం ఎట్లా నడుస్తున్నదో ఏమిటో. పైగా పాస్‌పోర్టు వగైరాలు సంపాదించాలి కద!' అన్నాడు శంకరం.

'ఏమిటోనయ్యా! నీవరస నాకేం నచ్చలేదు. ఇన్నాళ్ళు మమ్మల్నందర్నీ వొదిలి ఎక్కడో వున్నావు. రాకరాకవొచ్చి రెండురోజులైనా వుండకుండా వెళ్ళిపోతానంటున్నావు. నీ ఇష్టం. నామాట వింటావు గనకనా!' అన్నది సామ్రాజ్యమ్మ.

బాలా త్రిపురసుందరి శంకరం తెచ్చిన పత్రిక తిరగేస్తున్నదల్లా, తలెత్తి అతని కళ్ళల్లోకి చూసింది. కళ్ళతోనే 'ఉంటా వసరామా!' అని అభ్యర్థించింది.

శంకరం ఆమెనుంచి కళ్ళు తిప్పుకుని 'వీల్లేదత్తయ్యా! వెళ్ళి ఉత్తరాలు రాస్తుంటాగా. ఏడాదయ్యాక మళ్ళీ వస్తాను. అప్పుడు మీరు వెళ్ళమన్నా వెళ్ళను' అన్నాడు.

'సరే నీ ఇష్టం నాయనా!' అందావిడ. ఇంకా ఏమేమో అడగాలని చెప్పాలనీ ఉంది ఆవిడకు. కాని తొందరే మొచ్చిందని వూరుకున్నది. 'నేనలా పక్కింటికెళ్ళొస్తానమ్మా! బావతో మాట్లాడుతుండూ!' అని కూతుకి చెప్పి వెళ్ళిపోయింది.

శంకరం మరోసారి నవ్వుకున్నాడు. ఆట బొమ్మగా చూడబడుతోన్న ఆ పిల్లని చూస్తుంటే జాలివేస్తోందతనికి. స్వామాజ్యమ్మ బయటికి వెళ్ళిపోగానే చేతిలో పత్రిక టేబుల్ మీద పడవేసింది సుందరి. అతని వంక చూస్తూ 'అమ్మ ఇంత బ్రతిమాలుతున్నా ఉండనంటున్నావు కాదూ! సరేలే!' అన్నది మూతి ముడుచుకుని అతనికి మళ్ళీ నవ్వొచ్చింది ఆమె మొహం చూసి.

'అది సరేగాని సుందూ! ఉత్తరాలు రాస్తావా!' అడిగాడు.

'నేను అయిదోక్లాస్ చదివానని చెప్పేగా. నాకు ఎట్లా రాయటమో తెలీదు...' అందా పిల్ల.

'ఉత్తరం రాయటానికి పెద్ద చదువులేం అక్కర్లేదు. నీకు తోచినట్టే రాయాలి... నేను వెళ్ళాక అడ్రస్ ఇస్తూ ఉత్తరం రాస్తాను.' అన్నాడు శంకరం.

'సరే, కాని తప్పులుంటే నవ్వ కూడదు మరి.' అంది సుందరి.

'నవ్వనులే తప్పకుండా రాస్తావుకదూ!' అన్నాడు శంకరం.

'...సరే...'

ఈ రెండురోజుల పరిచయంతో ఉత్తరాల్లో ఏమని రాసుకోవటమో తెలీలేదతనికి, రాయమనగానే రాస్తానన్న ఆ పిల్లని చూస్తే జాలివేసింది శంకరానికి.

'నువ్వు రేడియో వింటావా బావా!' అని అడిగింది సుందరి.

'అప్పుడప్పుడు వింటుంటాను. ఏం?'

'అక్కడ మీ ఇలట్లో రేడియోవుందా?'

'ఒకటికాదు. రెండు రేడియోలు వున్నయి.' చెప్పాడు శంకరం.

'రేడియో స్టేషన్ చూశావా నువ్వు!' అడిగింది సుందరి.

'చాలాసార్లు చూశాను!'

'నే నక్కడికివస్తే అవన్నీ చూపిస్తావా నాకు?'

'తయారవు మరి! వెడదాం!' అన్నాడు శంకరం నవ్వుతూ.

ఆ పిల్ల కళ్ళు పెద్దవి చేసి చూసింది. 'అమ్మో! నీ వెంటే! అమ్మ ఒప్పుకోవద్దూ!' అన్నది.

'నేను ఒప్పిస్తాగా!' అన్నాడు శంకరం మాటవరసకి. హైద్రాబాద్ కు కాదు, నరకానికి పంపించమన్నా తయారే స్వామాజ్యమ్మ. ఇప్పుడు ఆమె విషయం అతనికి తెలిసినంతగా ఆ అమ్మాయి కేం తెలుసు.

'నిజం! ఏం చక్కా అక్కడికివస్తే రేడియో స్టేషన్ చూడవచ్చు. శారదా శ్రీనివాసన్ కనిపిస్తుందా మనకి?'

'ఆవి డెవరు?' అర్థం కాక అడిగాడు శంకరం.

'అయ్యో! ఆవిడే తెలీదా బావా! రేడియోలో నాటకాలు వేస్తుందీ. ఎంత చక్కగా మాట్లాడుతుందనుకున్నావ్. ఎంతబాగా నవ్వుతుందను కున్నావ్...' బావకి తెలీని విషయం చెప్పానన్న గర్వం ఆమెకి.

'ఈ సారెప్పుడున్నా విను!' సలహా ఇచ్చింది సుందరి.

'సరేలే! నీకోసం వింటాను!'

పరంధామయ్యగారు పొలంనించి రావడంతో సంభాషణ ఆగిపోయింది....

ఆర్రాత్రి భోజనం చేస్తుండగా అతనూహిస్తున్న విధంగానే సంభాషణ నడిచింది.

స్వామాజ్యమ్మగారు కదిలించారు మొదట 'అయితే పెళ్ళెప్పుడు చేసుకుంటావు బాబూ!' అంటూ.

శంకరం 'ఏమో! తిరిగి వచ్చాక ఆలోచిస్తాను.' అన్నాడు.

'ఎవరయినా ఉన్నారా దృష్టిలో?' ఈసారి పరంధామయ్య గారడిగేరు.

'అటువంటిదేమీ లేదు!' అన్నాడు శంకరం నవ్వుతూ.

'అమ్మడి కీయేడు పెళ్ళి చేసెయ్యాలనుకున్నాం.' అని భర్తవేపు చూసింది స్వామాజ్యమ్మగారు [illegible] మీ పంతన్నట్లు.


'నువ్వాగమంటే ఏడాది దాకా ఆగుతాం నీ కిష్టమయితేనే సుమా!' అన్నారు పరంధామయ్యగారు.

'మీ ఇష్టమే. నా ఇష్టం, అయినా వెళ్ళాక వుత్తరం రాస్తానుగా!' అన్నాడు శంకరం. అతనికి వీళ్ళందర్నీ మోసం చేస్తున్నానేమో, లేనిపోని ఆశలు కల్పిస్తున్నానేమోనని భయంగా వున్నది. కాని ఏమీ చెప్పడం అప్పుడు.

స్వామాజ్యమ్మగారు ఆకాశాన్నందుకున్నంత మురిసి పోయింది. బాలా త్రిపురసుందరి విషయం చెప్పక్కర్లేదు.

(64 వ పేజీ చూడండి)



'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్‌తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం॥


కుటుంబ నియంత్రణకు

## సత్వరక్షణి

* ఆపరేషన్ భయములేదు. * పురుషులు మాత్రమే యీ ఔషధము సేవించుటకు తయారుచేయబడినది * ఔషధమువలన ఎవ్వరికి సంతానము కలుగక ఆరోగ్యవంతులుగా ఉందురు. * దాంపత్యజీవితమున కెట్టి అసౌకర్యము ఉండదు. * నరములు పటుత్వను కల్గి మంచి ఉత్సాహమును ప్రసాదించును. * ఔషధము మాత్రం 30 రోజులు సేవించవలెను. * పత్యములేదు. పూర్తి కోర్సు సీసా వెల రు. 10/– పోస్టేజి ప్యాకింగ్ అధనం.

స్వదేశీ ఆయుర్వేద ఫార్మశీ,
తెనాలి, (ఆంధ్ర ప్రదేశ్)



రు. 8/-లకు మాత్రమే



నవీన డిజైనులలో, రంగులలో మిక్కిలి అందమైన చీరలు. 1 చీర ధర రు. 8, 2 చీరలు రు. 15/- 3 చీరలు రు. 21. స్పెషల్‌డీలక్ రు.10/-. 2 చీరలు రు. 19/- 3 చీరలు రు. 27/-. 4 చీరలు రు. 35/-. 2 లేక అంతకు ఎక్కువ చీరలు కొన్న వారికి బ్లౌజ్ పీసు మరియు ఇయర్‌టాప్స్ ఉచితంగా ఇవ్వబడును.

Arvind Agencies (WAP 23)
P. O. Box 1408 Delhi-6.



## తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "SWETARI" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

Sri Krishna Chandra Vaidya
(A. P.) P O. Katrisarai (Gaya)


# మనిషి బుద్ధి

(47–వ పేజీ తరువాయి)

లోకాభిరామాయణం మాట్లాడుతూ శంకరం తప్ప అందరూ నిశ్చింతగా నిద్ర పొయ్యేరు.

మర్నాడు ప్రొద్దున బయల్దేరాడు శంకరం. స్రామాజ్యమ్మ వుత్తరాలు రాస్తుండమని చెప్పింది. సుందరి కన్నీళ్లు తెచ్చుకుంది. అతనికి ఏడుపు వచ్చింది. 'ఇదంతా అబద్ధం' అని చెప్పాలనుకునీ చెప్పలేక పోయేడు.

పరంధామయ్యగారు బస్సుదాకా వచ్చేరు.

బస్సు కదులుతుండనగా శంకరం చేతిలో రెండు వందల రూపాయలు పెట్టారాయన. 'ఖర్చుల కుంటుంది, శంకరం తీసుకో. బీదవాణ్ని ఇంతకన్నా ఎక్కువివ్వలేను.' అన్నారు ఆయన. వొద్దనాలనుకునీ అనలేక పోయేడు శంకరం. మౌనంగా తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

'వుత్తరం రాయటం మర్చిపోకు శంకరం!' అన్నారు పరంధామయ్యగారు, 'సరే మామయ్యా! మీరూనా వెంట వాస్తేనే బాగుండేది! ఓసారి అంతాచూసి వచ్చేవారు!' అన్నాడు శంకరం.

'ఇప్పుడు పనులున్నాయి. మరోసారి ఎప్పుడైనా వాస్తాలే! రాకపోక లెప్పటికేనా తప్పునాయె!' అన్నారు పరంధామయ్యగారు.

బస్సు కదిలింది.—

ఆ రోజు రాత్రి బాలా త్రిపురసుందరికి నిదర రాలేదు. అకస్మాత్తుగా ఎక్కణ్నించో వూడిపడి, వచ్చినంత హఠాత్తుగా మళ్లీ వెళ్లిపోయిన బావనుగురించే ఆలోచిస్తూ వుండిపోయింది. అతను వెళ్లిపోవటంలో తనకింత బాధ ఎందుకు కలుగుతున్నదో అర్థం కాలేదా పిల్లకి. మనసునెంత అదుపులో పెట్టుకుందామన్నా అది శంకరం వేపే పరుగిడుతున్నది. మళ్లీ చాలా రోజులయ్యాక వచ్చి తనను కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి దేశదేశాలూ తిప్పుతాడని కలలు కంటోంది. అతను ముద్దుపెట్టుకున్న అరచేతిని అలానే పెదాలకానించుకుని తెల్లవారే దాకా వెచ్చటి ఊహలతో మంచంమీద అటునించిటూ పొర్లుతూ ఉండిపోయింది.

స్రామాజ్యమ్మ, పరంధామయ్యగార్లూ, గొప్ప వాడయిన అల్లుడిలో కూతురు సుఖ పడుతుందని, అంతకన్నా మంచివరుణ్ని ఎన్ని జన్మలెత్తినా సంపాదించటం కష్టమనీ, తమ అదృష్టానికి మురిసిపోతూ సంతృప్తిగా నిదర పొయ్యారు.

అదే రాత్రి హైద్రాబాదు హోటల్ అన్నపూర్ణలో పప్పురుబ్బుతూ కునికిపాట్లు పడుతున్న శంకరం, మామయ్యిచ్చిన రెండొందలతో చిన్న టీ కొట్టు తెరిచినట్టు, ఏడాది లోపల దాన్ని పెద్దహోటల్‌గా మార్చేసినట్టు, చిన్నకారొకటి కొనుక్కుని, దాన్లో వెళ్లి సుందరిని వెంటబెట్టుకుని ఝామ్మంటూ వచ్చినట్టు, కలలు కంటున్నాడు. ●


**FREE BOARDING & LODGING**

గుంటూరు కాలేజీలలో చదువుకునే 25—బీద బ్రాహ్మణ విద్యార్థులు వుచిత భోజన వసతికొరకు అరండల్ పేటలోని శ్రీ రామకృష్ణ బీదబ్రాహ్మణ వుచిత విద్యార్థి గృహమునకు స్వంత చిరునామాతో పోష్టుకవరు పంపవలెను.

డా॥ కె. వి. కృష్ణమూర్తి,
స్టేషన్ రోడ్, గుంటూరు–1.


# అవీ - యివీ...

మే నెల 18, 19, 20, 21 తారీఖులలో కలకత్తా ఆంధ్ర సంఘంవారు వారి స్వంత హాలులో నాటిక పోటీలు నిర్వహించారు. సంఘాధ్యక్షులు డా. ఐ. వి. కృష్ణమూర్తి 18 వ తారీఖున ప్రారంభోత్సవం చేశారు. శ్రీయుతులు వేదాంతం సుబ్రహ్మణ్యం, యస్. ఎస్. చక్రవర్తి, బులుసు సూర్యనారాయణ గార్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 12 నాటికలు చూపించారు.

పోటీలు జయప్రదంగా ఒరిపించిన మెంబరు— ఇన్— చార్జి శ్రీ పద్మసోల సుబ్బారావు అందరికీ ధన్యవాదాలు చెప్పడంతో, జన గణ మనతో పోటీ ఉత్సవాలు ముగిసాయి.

*　　*　　*

గుంతకల్లు రయిల్వే ఇన్‌స్టిట్యూట్ కళా సమితివారు 30—4—67 నుంచి 7—5—67 దాకా తమ అష్టమ నాటక, నాటిక పోటీలు జయప్రదంగా జరుపుకున్నారు. 'ఆరాత్రి, ఆరాధన, మంచుతెర, నీడలోనిజం' ప్రదర్శనలకి బహుమతులు వచ్చాయి. కొందరు నటీనటులకి కూడా బహుమతులు వచ్చాయి. (ఓ. వి.) ●


**Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.**